
క్లుప్తంగా

వినాయకుడికి దీపారాధన



వెంగాపురంలో గంటవీధి వినాయకుడి మంటపంలో దీపారాధన చేసిన భక్తులు

బలిజిపేట: వినాయక ఉత్సవాలలో భాగంగా మండలంలోని వెంగాపురం గంటవీధిలో ప్రతిష్టించిన వినాయక మంటపం వద్ద కమిటీ ఆధ్వర్యంలో భక్తులు దీపారాధన ఘనంగా చేశారు. దీపాలను శంఖు, చక్ర, పద్మ ఆకారాల్లో తయారుచేసి వాటిని వెలిగించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెద పెంకిలో ఆదిభట్ల జయంతి



ఆదిభట్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎం.మహేష్, ఎం.శంకరరావు, ఎ.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశ తల్లి వారాలు



కొత్తపట్నం గ్రామదేవత దేశతల్లికి మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని కొత్తపట్నం గ్రామంలో ఆదివారం గ్రామస్తులంతా దేశ తల్లి వారాలను కుటుంబసభ్యులు, బంధువుల సమేతంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో ఊరి పొలిమేరలో కొలువైన గ్రామదేవత దేశతల్లికి గ్రామస్తులంతా ఒకేచోట మొక్కులు చెల్లించి తమ కోరికలను విన్నవించుకున్నారు. ఈ మేరకు కొత్తపట్నం గ్రామంలో వారాల పండగతో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది.

నిరుపేద కుటుంబానికి రూ.10వేల వితరణ



వితరణ అందిస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: నిరుపేద కుటుంబానికి విరాళాలు సేకరించి రూ.10,400లు వితరణగా అందించినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన నిరుపేద చిన్న కుర్రాడు పెంకి దినేష్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆర్థిక సాయం అందించేందుకు గ్రామంలో విరాళాలు సేకరించగా రూ.10,400లు వసూలు కావడంతో వాటిని ఆ కుటుంబానికి అందజేసినట్లు సంజీవినాయుడు తెలిపారు. కార్యక్రమంలో కె.నారాయణరావు, ఎస్.భూషణరావు, జి.శ్రావణ్‌కుమార్, కె.గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వినాయక నిమజ్జనం, అన్నసంతర్పణ



పెదభోగిలిలో అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు, అన్నసంతర్పణలు ఆదివారం జరిగాయి. ఈ మేరకు పెదభోగిలిలో యాదవయూత్ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. అలాగే తామరఖండి శివాలయం యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం జరిగింది. నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని కోలాటం, బిందెలతో నృత్య ప్రదర్శనలు జరిగాయి. పెదభోగిలి యాదవ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని సువర్ణముఖి నది వరకూ ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

అపరభగీరథుడి ఆశయానికి రూపం పెద్దగెడ్డ

- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో.. రాష్ట్రంలో మొట్టమొదట పూర్తయిన పెద్దగెడ్డ రిజర్వాయర్
- 12 వేల ఎకరాలకు సాగునీరు అందించిన రైతుబాంధవుడు
- వైఎస్సార్ వర్ధంతి రేపు



పెద్దగెడ్డ ఆధారంగా సాగవుతున్న పంట పొలాలు

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా దూరమైనా ఆయన గుర్తులు సాలూరు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అపరభగీరథుడైన దివంగత ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయానికి నిలువెత్తు రూపం పాచిపెంట మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయం.పుష్కలంగా నిండిన నీటితో రిజర్వాయర్, జలకళను సంతరించుకున్న సందర్భంలో, రిజర్వాయర్ కింద వేల ఎకరాలకు సాగునీరు అంది, పచ్చని పైరుల పలకరింపులో దివంగత ముఖ్యమంత్రి వైస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తులు కనిపిస్తూనే ఉంటాయి. పెద్దగెడ్డ రిజర్వాయర్ పేరు చెప్పగానే ఇక్కడి ప్రజలకు గుర్తువచ్చేది ముందుగా రాజశేఖర్‌రెడ్డే. అపరభగీరథుడైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇక్కడి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది.ఈ నిర్మాణంపై రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ, నాటి స్థానిక ఎమ్మెల్యే రాజన్నదొర పట్టుదల వెరసి జలయజ్ఞంలో రాష్ట్రంలోనే మొట్టమొదటగా ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి, 2006 సెప్టెంబరులో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు చెందిన సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.ఈ రిజర్వాయర్ ద్వారా సీపీడబ్ల్యూ పథకం కింద సుమారు 96 గ్రామాలకు తాగునీరు అందుతుంది.



పెద్దగెడ్డ రిజర్వాయర్

సాలూరు పట్టణానికి తాగునీరు

ఈ రిజర్వాయర్ ద్వారా తాగునీటిని సాలూరు పట్టణ వాసులకు అందించే పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో అడుగులు పడ్డాయి. సాలూరు మండలంలో బురదాలమ్మ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో రాజశేఖర్‌రెడ్డి పాత్ర మరువలేనిది. మక్కువ మండలంలో వెంగళరాయసాగర్, మెంటాడ మండలంలో ఆండ్ర జలాశయాల ఆధునికీకరణకు జైకా నిధుల మంజూరులో రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రతిపాదనలు చేశారు. రైతుబాంధవుడుగా నిలిచిన రాజశేఖర్‌రెడ్డిని రైతులు వారి కుటుంబాలు, అన్ని వర్గాల ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

రాజశేఖర్‌రెడ్డి మేలు మరిచిపోలేం



రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాజన్నదొర కృషితో జలయజ్ఞంలో భాగంగా రాష్టంలో తొలిసారి పాచిపెంట మండల కేంద్రంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ పూర్తిచేసి ప్రారంభించారు.ఆ రిజర్వాయర్ ఆధారంగా 12 వేల ఎకరాలకు సాగునీటితో పాటు 96 గ్రామాలకు సీపీడబ్ల్యూ ద్వారా తాగునీరు అందుతోంది. అంతే కాకుండా ఈ రిజర్వాయర్ ఆధారంగా మరెందరో బతుకుతున్నారు.రిజర్వాయర్ ఫలాలు నేటికీ ప్రజలకు అందుతున్నాయి. రాజశేఖర్‌రెడ్డి, రాజన్నదొరలు చేసిన మేలును ప్రజలెవరూ మరిచిపోలేరు.

– బడ్నాన ప్రమీల, ఎంపీపీ, పాచిపెంట

సంగంవలసలో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఐదోరోజున గ్రామంలోని కూరాకుల వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయకుని మంటపం వద్ద మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఈ పూజల్లో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం పరస్పరం వాయినాలు చెల్లించుకుంటూ తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చవితి మంటపాల్లో కొలువైన విఘ్నేశ్వరునికి ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు, సాయంకాలం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తూ ఘనంగా నవరాత్రులను జరుపుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: 11కేవీ లైనుకు సంబంధించి బలిజిపేట రూరల్ ఫీడరులో చెట్లను తొలగించేందుకు గాను సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఏఈ సింహాచలం కోరారు. పలగర, మిర్తివలస, చెల్లెంపేట, బర్లి, సుభద్ర, బడేవలస, శివరాంపురం, పణుకువలస, అరసాడ, పదమాయవలస, పి.చాకరాపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని దీనిని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

లేఅవుట్ల యజమానులతో సమావేశం రేపు

కురుపాం: మేజరు పంచాయతీ పరిధిలోని లేఅవుట్ల యజమానులతో ఈ నెల 2వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణ అధికారి కండి సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. అధికారిక, అనధికారిక లేఅవుట్ల యజమానులు, బొబ్బిలి అర్బన్ డెవలపర్స్ అథారిటీ అధికారులంతా ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో జరిగే ఈ సమావేశానికి లేఅవుట్ల యజమానులంతా హాజరుకావాలని కోరారు.

రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయండి

కురుపాం: ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా వారికి సరిపడ ఎరువులు సరఫరా చేయాలని ట్రైబల్ రైట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్తే అక్కడి వీఏఏలు తమ వద్ద ఎరువులు లేవు..ఇండెంట్‌లు పెట్టా మని అక్కడి నుంచి పంపేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి సాగు జరుగుతోందని, ఇలాంటి సమయంలో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేయాలని తెలియదా అని అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అందరు దివ్యాంగులకు పింఛన్ పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పార్వతీపురం రూరల్: ఇటీవల పునఃపరిశీలన పేరుతో దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లలో కొందరిని అనర్హులుగా గుర్తించి పింఛన్లు నిలిపివేసింది. అయితే ఆగస్టు 30వ తేదీలోగా పునఃపరిశీలన పేరుతో తొలగించిన వారు నేరుగా గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ అప్పీల్ చేసుకుంటే సెప్టెంబర్ 1న పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు 136మంది అప్పీల్ చేయకపోగా వారికి పింఛన్ డబ్బులు చెల్లిస్తారో? లేదోనన్న క్రమంలో వారికి కూడా పింఛన్ డబ్బులు చెల్లించేందుకు ఆదివారం సాయంత్రం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చినట్లు డీఆర్‌డీఏ పీడీ సుధారాణి తెలిపారు.

ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా ఎంతమందికి అయితే పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందో సెప్టెంబర్ నెలకు సంబంధించి కూడా వారందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పింఛన్‌ను విధిగా అందజేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

సేవలే చిరస్మరణీయం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆర్ఏఎస్ కుమార్, సంబంధిత శాఖ అధికారులు

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు అందించే సేవలే చిరస్మరణీయంగా గుర్తింపు తెస్తాయని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆర్ఏఎస్ కుమార్ అన్నారు. జిల్లా ట్రెజరీలో ఉపఖజానా అధికారిగా విధులు నిర్వహించిలు ఉద్యోగ విరమణ పొందిన నక్కిన సూర్యచంద్ర శేఖర్‌కు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ జి.నారాయణ, పి.సురేష్‌కుమార్, ప్రెసిడెంట్ కేవీఎస్ఎస్ సిందూర, సెక్రటరీ ఏపీటీఎస్ఏ ఉమ్మడి విజయనగరం జిల్లా ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు కిశోర్, మన్యం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ సుధాకర్, కోశాధికారి కె.శంకరరావుతో పాటు రిటైర్డ్ డీటీఓలు, సహాయ ఖజానా అధికారులు, ఇతర సహోద్యోగులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



పాలకొండ: సైకిల్ ర్యాలీ చేస్తున్న డీఎస్పీ, సిబ్బంది

- డీఎస్పీ రాంబాబు

పాలకొండ: పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలని డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. పట్టణంలో సండే సైకిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఒత్తిడిని జయించడానికి సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆయనతో పాటు ఎస్సై ప్రయోగమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌కు సైకిల్ తొక్కాల్సిందే ..

సీతంపేట: ఫిట్‌నెస్‌కు సైకిల్ తొక్కాల్సిందేనని స్థానిక ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఫిట్ ఇండియా నినాదంతో పోలీసులు, యువతతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు.

'సండే ఆన్ సైకిల్'

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేటలో పోలీసుల ఆధ్వర్యంలో సండే ఆన్ సైకిల్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సీఐ బి.హరి పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో సైకిల్ తొక్కుతూ సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ కొంత సమయం సైకిల్ తొక్కడం వల్ల శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు.



భామిని: ఎస్సై అప్పారావు ఆధ్వర్యంలో సైకిల్ తొక్కుతున్న యువత

బత్తిలిలో..

భామిని: మండలంలోని బత్తిలిలో ఎస్సై జి.అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. యువత ఆరోగ్యం కోసం సైక్లింగ్ చేయాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సాధనకు కృషి చేద్దాం..

వీరఘట్టం: ఫిట్ ఇండియా సాధనకు అందరం కృషి చేద్దామని ఎస్సై జి.కళాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సహచర సిబ్బందితో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అన్నివర్గాల వారు వ్యాయామం చేయాలని సూచించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

- గిరిజనుల డిమాండ్

పాచిపెంట: హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని శతాబి ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు డిమాండ్ చేశారు. నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో స్థానిక గిరిజనుల ప్రమేయం లేకుండా సర్వేరాళ్లను వేయడం దుర్మార్గమని స్థానిక సర్పంచ్ శిల్పుజన్ని రామయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జన్ని రామయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడులు ఆదివారం తెలిపారు. గిరిజనుల భూములను స్వాధీనం చేసుకుని విద్యుత్ ఉత్పత్తికి చేసే ఈ ప్రాజెక్టు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. గిరిజనుల చట్టాలను కాపాడాలని, అందరం ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఈ మేరకు శతాబి వద్ద ర్యాలీ చేయడంతో పాటు అక్కడ వేసిన సర్వేరాళ్లను గిరిజనులు పగలగొట్టి ,పక్కకు పడేశారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



హైడ్రో మార్కింగ్ రాళ్లను ధ్వంసం చేస్తున్న గిరిజనులు

జీసీసీని బలోపేతం చేయండి

జియ్యమ్మవలస రూరల్:

జీసీసీని మరింత బలోపేతం చేయాలని నాగూరు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే కేకేవీవీ సత్యనారాయణరెడ్డిలు కోరారు. ఇదే విషయమై వారు అమరావతిలో గిరిజన సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జీసీసీని పూర్తిగా నిర్వీర్యం చేసి గిరిజనులకు వాటి సేవలు దూరం చేశారన్నారు. ఈ నేపథ్యంలో డీఆర్ డిపోలను పూర్తిస్థాయిలో నిర్మించి ఇవ్వాలని, గిరిజనులకు జీఎస్‌టీలో మినహాయింపు ఇవ్వాలని, జీసీసీలో పనిచేసే అధికారులకు ఆర్ఎం, జీఎంలుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల కోసం రైతుల ఇక్కట్లు

- పట్టించుకోని పాలకులు



మాట్లాడుతున్న రాష్ట్ర, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు నాయకులు

సీతానగరం: ఖరీఫ్ పంటల సాగులో రైతులు వరినాట్లు వేసి నెలలు కావస్తున్నా అవసరమైన ఎరువులు సమకూర్చడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్‌వింగ్ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్‌రామకృష్ణ, పార్టీ జిల్లాఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, రైతువిభాగం జిల్లానాయకుడు పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని వివిధగ్రామాల్లో ఎరువులు వేయని పంటపొలాలను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం పార్టీ మండల కార్యాలయంలో మాట్లాడుతూ నీటివనరులు పుష్కలంగా ఉన్న మండలంలో పంటలు సాగు చేయడం కార్తిల ననుసరించి జరుగుతుందని, కార్తికుల ననుసరించి రైతులకు అవసరమైన ఎరువులు ముందుగా సమకూర్చాల్సి ఉన్నా పాలకులు పట్టించు కోలేదన్నారు. కొన్ని గ్రామాలకు ఎరువులు వచ్చినా అధికార పార్టీ నాయకులు వినియోగించుకున్నారని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

సచివాలయ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?



కొదమలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం భవనం

సాలూరు రూరల్: మండలంలో ఏజెన్సీ ప్రాంతమైన కొదమ పంచాయతీలో గత ప్రభుత్వంలో రూ.42లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం ఎప్పుడు పూర్తి చేస్తోందోనని గిరిజనులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం సచివాలయ నిర్మాణం చేపట్టింది. అయితే ఈ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన పనులు కూటమి ప్రభుత్వం పూర్తి చేసి సచివాలయ సేవలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తుందోనని స్థానిక గిరిజనులు ఎదురు చూస్తున్నారు. ఏ అవసరమైనా మైదాన ప్రాంతాలకు రావల్సి వస్తోందని గిరిజనుల అవసరాలను తీర్చే సచివాలయం పనులు వెంటనే పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో ఘనంగా వారాల పండగలు



పెదంకలాంలో వనంగుడికి డప్పువాయిద్యాలతో వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ పంటల ప్రాథమిక పనులు నిర్విఘ్నంగా జరగడంతో రైతులకు దీవెనలు అందించిన గ్రామదేవతలు, దేశమ్మతల్లికి వారాల రూపంలో అమ్మవార్లకు ప్రీతికరమైన ఆదివారం రోజున కుంకుమ, పసుపు, ప్రసాదాలతో మేళతాళాలతో వనంగుడి వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.ఈ మేరకు పెదంకలాం, నీలకంఠాపురం, చినంకలాం, చినభోగిలి, కొత్తవలస తదితర గ్రామాల్లో రైతులు కుటుంబాలతో ఊరు శివారులో ఉన్న అమ్మవారి వనంగుడి వరకూ జనసందోహంతో డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా పూజాసామగ్రితో తిరువీధి చేసుకుంటూ వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పొలాల్లో పండిన పంట ఇంటికి వచ్చినంత వరకూ అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని కోరుతూ పూజలు చేశారు. అమ్మవార్లను ఎంపీపీ బి.రమణమ్మ, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు దర్శించుకుని పూజలు చేశారు.

వినాయకుడికి సామూహిక హారతి



ఎం.పాలికవలస గ్రామంలో సామూహిక హారతి ఇస్తున్న మహిళలు



మక్కువలోని జంగాల వీధిలో అన్న సమారాధన కార్యక్రమం



శంబరలో దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని సామూహిక హారతి, దీపారాధన, అన్న సమారాధన కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు నిర్వహించారు. మండలంలోని ఎం.పాలిక వలస గ్రామంలో గిరిజన మహిళలు వినాయక స్వామికి సామూహిక హారతి ఇవ్వగా, శంబర గ్రామంలో దీపారాధన నిర్వహించారు. అలాగే స్థానిక జంగాల వీధిలో కమిటీ సభ్యులు అన్న సమారాధన నిర్వహించారు. ఎర్ర సామంతవలస గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

మొక్కల పంపిణీ

కురుపాం: పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ మండలంలోని బియ్యాలవలస పంచాయతీ, దురుబిలి గ్రామంలోని గిరిజన రైతులకు పండ్లతోటల మొక్కలను రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి కొత్తకోట మల్లికార్జునరావు అందజేశారు. మొత్తం 75 మందికి మామిడి, సపోటా, జామ మొక్కలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, సర్పంచ్ పువ్వల అజ్జారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి తదితరులు పాల్గొన్నారు.